జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం

గురువారం | 3 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 6




# గిరిజన బిడ్డకు గౌరవ డాక్టరేట్

- సామాజిక సేవ, యువజన అభివృద్ధిలో విశేష కృషికి బానోత్ వెంకటేష్ కు అరుదైన గౌరవం




**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 02 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం సంధ్య తండాకు చెందిన గిరిజన బిడ్డ బానోత్ వెంకటేష్ అరుదైన ఘనత సాధించారు. సామాజిక సేవలు, యువజన అభివృద్ధి రంగాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించిన ఆసియా వేదిక్ అంతర్జాతీయ సాంస్కృతిక మరియు పరిశోధన క్రీడా అకాడమీ గౌరవ డాక్టరేట్ పురస్కారంతో సత్కరించింది.సాధారణ గిరిజన కుటుంబం

మిగతా 2 లో...



# అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలి ...

- ఎమ్మెల్యే రాగమయి
- యోజకవర్గ స్థాయి కాంగ్రెస్ సోషల్ మీడియా సమావేశం

**సత్తుపల్లి సెప్టెంబర్02(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి చెందుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ అన్నారు. నియోజకవర్గస్థాయిలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ సోషల్ మీడియా సమావేశం బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.ఈ సమావేశంలో టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ పెట్టేం నవీన్, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. అలాగే సత్తుపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్ చార్జ్ కిషోర్ పోతు రాజు, నియోజకవర్గంలోని ఐదు మండలాల, టౌన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, గ్రామ శాఖల సోషల్ మీడియా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు స్పష్టంగా వివరించేలా సోషల్ మీడియా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ పెట్టేం నవీన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా కార్యకర్తలు చురుకైన

మిగతా 2 లో...

# ఐసీడీఎస్ లో 'ఆట'..!



- తిరుమలాయపాలెంలో తెర వెనుక ఏం జరుగుతోంది..?
- అంగన్ వాడీ లెక్కల్లో తేడా లేంటి..? పౌష్టికాహారం సరఫరాపై అనుమానాలేంటి..?
- రికార్డుల్లో అంతా సవ్యమేనా..? క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఏమిటి..?

**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి సెప్టెంబర్ 02:** చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాల్సిన ఐసీడీఎస్ వ్యవస్థపై తిరుమలాయపాలెం మండలంలో పలు అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల వివరాలు, పౌష్టికాహారం సరఫరా, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డుల విషయంలో "లెక్కల్లో ఉన్నది..నేలపై ఉన్నది ఒకటేనా?" అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**లెక్కల వెనుక 'లెక్క' ఏంటి..?**

అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగానే పౌష్టికాహారం అందుతోందా? వచ్చిన సరుకులు పూర్తిగా స్టాక్ లో నమోదవుతున్నాయా? పంపిణీ చేసినట్లు చూపుతున్న వివరాలు వాస్తవంగానే ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు

మిగతా 2 లో...

# కారేపల్లి లో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

- సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- ముఖ్యఅతిథిగా పాల్గొని బోనమెత్తిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**కారేపల్లి, సెప్టెంబర్ 2, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రం కారేపల్లిలో లో బుధవారం రాత్రి శ్రావణ మాసం సందర్భంగా గ్రామస్తులు ఘనంగా ముత్యాలమ్మతల్లి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ఆధ్వర్యంలో డీజే చప్పుళ్ళ తో ,మేళతాళాలతో గ్రామం నుండి ముత్యాలమ్మ తల్లి దేవాలయం వరకు ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాల వెలుగులో ఊరేగింపు గా జరిగిన ఈ వేడుకలలో కులమతాలకు అతీతంగా మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని, ,ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, బోనం ఎత్తుకొని ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

మిగతా 2 లో...

# రోడ్డుకు అడ్డంగా సిమెంట్ లారీ బోల్తా

- అందులో ప్రయాణిస్తున్న రైల్వే హోంగార్డుకి తీవ్ర గాయాలు
- తప్పిన భారీ ప్రమాదం
- రెండు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం
- జెసిబిల సహాయంతో బోల్తాపడ్డ లారీను తొలగించిన ఎస్సై మాచినేని రవి



**బోనకల్, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):** రోడ్డుకు అడ్డంగా భారీ సిమెంట్ లారీ బోల్తా పడ్డ సంఘటన వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై మండల పరిధిలోని రావినూతల గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటల సమయంలో వైయస్సార్ విగ్రహ సమీపంలో చోటు చేసుకుంది... స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్యపేట నుండి జువారి సిమెంట్ లోడ్ వేసుకొని వైరా వైపు వెళ్తున్న లారీ మండల పరిధిలోని రావినూతల గ్రామ సమీపంలో వెళ్లేసరికి ఈ భారీ వాహనాన్ని ఒకేసారి డ్రైవరు నిర్లక్ష్యంగా మార్జిన్ దింపటంతో మళ్లీ ఎక్కించే ప్రయత్నంలో ఒకేసారి అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అక్కడి స్థానికులు ఒక్కసారిగా

మిగతా 2 లో...

## రోడ్డుకు అడ్డంగా సిమెంట్ లారీ బోల్తా

(మొదటి పేజీ తరువాయి...)

ఊపిరి పీల్చుకున్నారు. లారీ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడటంతో ట్రాఫిక్ కు భారీగా అంతరాయం ఏర్పడింది. ఇరువైపుల భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అయితే లారీలో ప్రయాణిస్తున్న ఖమ్మం రైల్వే లో హోంగార్డుగా పని చేస్తున్న సింగ్ నరేష్ (40) కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించారు. 108 సంఘటన స్థలానికి చేరుకొని సిబ్బంది కోట భానుసాహన్, ఎం ఎం చక్రవర్తి ప్రధమ చికిత్స అందించారు. అనంతరం మెరువైన వైద్యం కోసం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో సుమారు రెండు నుంచి మూడు గంటల పాటు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. వెంటనే బోనకల్ ఎస్సై మాచినేని రవి తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జెసీబీ ల సహాయంతో రోడ్డుకి అడ్డంగా బోల్తా పడిన లారీని తొలగించి ట్రాఫిక్కును అంతరాయం లేకుండా యధావిధిగా కొనసాగించారు.

## అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలి ...



(మొదటి పేజీ తరువాయి...)

పాత్ర పోషించాలని సూచించారు.రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలు వాస్తవాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో సోషల్ మీడియా కీలక వేదికగా మారిందని, పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, సోషల్ మీడియా కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, టౌన్ మరియు గ్రామ స్థాయి సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కారేపల్లి లో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



(మొదటి పేజీ తరువాయి...)

మండల చరిత్రలో ఎప్పుడు, ఎక్కడ ,ఎన్నడూ లేని విధంగా ఈ వేడుకలన సర్పంచి టోని ఘనంగా నిర్వహించారని , టోనికి, ఆలయ కమిటీ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, పార్టీ టౌన్ అధ్యక్షుడు డాక్టర్ పోలగాని శ్రీనివాసరావు, నాయకులు అడ్డగోడ ఐలయ్య, సురేందర్ మనియార్, ఎండి యాకూబ్ అలీ, కడియాల సుధాకర్, గుడిపూడి తిరుమలరావు, ఈసాల నాగేశ్వరరావు , గుగులోతు భీముడు, ధారావత్ వినోద్, వాంకుడోత్ గోపాల్ నాయక్, ధరావత్ బద్దూలాల్, అడప పుల్లారావు, చాగంటి వెంకటేశ్వర్లు (చిన్న), షేక్ మజీద్ పాషా (షేరు) ,షేక్ షరీఫ్ ,తాజుద్దీన్, యడ్లపల్లి రాము, సర్పంచులు బానోత్ హీరాలాల్ , దండు ప్రవీణ్, పొడుగు పెంటయ్య, మూతి వీరస్వామి ,హేమలత, రాఘవులు, భూక్య బాలు ,మేదరి రాజా, ముత్యాలమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# 155 కోట్లతో ఆధునిక మార్కెట్ అభివృద్ధి

- రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు
- మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు



**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) సెప్టెంబర్: 2** ఖమ్మం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ₹155 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తెలిపారు. గతంలో మార్కెట్‌లో చిన్నచిన్న షెడ్లు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా 2017లో భారీగా మిర్చి బస్తాలు రావడంతో మార్కెట్ పరిసర రహదారులపై కూడా బస్తాలను నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా 2 లక్షల బస్తాలకు పైగా వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నూతన మార్కెట్‌ను రూపకల్పన చేస్తున్నామని తెలిపారు.

**మార్కెట్ ఆధునికీకరణలో ముఖ్యాంశాలు :**

₹155 కోట్లతో నూతన మార్కెట్ అభివృద్ధి, మొత్తం 15 ఎకరాల 20 కుంటల విస్తీర్ణంలో మార్కెట్ నిర్మాణం, దాదాపు 7 ఆధునిక షెడ్ల నిర్మాణం, ఒక్కో షెడ్ సుమారు 90 అడుగుల వెడల్పు – 400 అడుగుల పొడవు, ఏడో షెడ్డులో మెజనైన్ ఫ్లోర్ ఏర్పాటు, రైతుల కోసం విశ్రాంతి భవనం, ట్రేడర్లు, ఆడతీ వ్యాపారులు, గుమాస్తాలు, హమాలీలు, దడవాయిల కోసం ప్రత్యేక గదులు, షెడ్ల మధ్య 80 అడుగుల వెడల్పుతో రహదారులు, 4 మినరల్ వాటర్ ప్లాంట్లు, ఆధునిక సౌకర్యాలతో 3 టాయిలెట్ బ్లాక్‌లు, మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా, వర్షపు నీరు పూర్తిగా బయటకు వెళ్లేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి షెడ్డులో ఆధునిక LED లైటింగ్, భద్రత కోసం 120 అధునాతన CCTV కెమెరాలు, 12 అడుగుల ఎత్తైన ప్రహరీ గోడ, 90 వేల లీటర్ల సామర్థ్యంతో OHSR వాటర్ ట్యాంక్, 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంప్, డొమెస్టిక్ అవసరాలతో పాటు ఫైర్ ఫైటింగ్ సిస్టమ్, మొత్తం 7 షెడ్లకు అగ్ని ప్రమాద నివారణ వ్యవస్థ.

**నాణ్యత విషయంలో రాజీ లేదు**

మార్కెట్ నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని హనుమంతరావు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు నాబార్డ్‌కు చెందిన నాస్కాన్ వంటి కన్సల్టెన్సీ సంస్థను నియమించడంతో పాటు ఏడుగురు ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల సుమారు 6 లక్షల మొక్కజొన్న బస్తాలను నిల్వ చేసిన సందర్భంలో 70–80 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ వాహనాలు వచ్చినప్పటికీ రోడ్లకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్మాణ నాణ్యతకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.

**మార్కెట్ చుట్టుపక్కల మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు**

మార్కెట్ చుట్టూ నాలుగు వైపులా CC రోడ్ల నిర్మాణానికి ₹1,57,20,940, డ్రైనేజీ నిర్మాణానికి ₹66,95,058 కేటాయించినట్లు తెలిపారు. అలాగే తూర్పు వైపున ఉన్న పాత ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ₹25,91,139 మంజూరైనట్లు వెల్లడించారు.

**అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం**

మార్కెట్ విస్తరణలో భాగంగా పశ్చిమ వైపు ఉన్న 39 మంది నిరుపేదల గుడిసెలను తొలగించినప్పటికీ, వారికి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించిన తర్వాతే తరలింపు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 26 కుటుంబాలకు అల్లిపురం వద్ద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మిగిలిన 13 కుటుంబాలకు పట్టాలు మంజూరు, త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పట్టాల పంపిణీ, అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నదే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యమని హనుమంతరావు పేర్కొన్నారు.

**విమర్శలు చేసే ముందు మార్కెట్‌ను పరిశీలించాలి**

మార్కెట్ నిర్మాణంపై విమర్శలు చేస్తున్నవారు ముందుగా మార్కెట్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి, ఆధునిక సాంకేతికత, నిర్మాణ నాణ్యతను పరిశీలించాలని హనుమంతరావు సూచించారు. "ఎవరో చెప్పిన మాటలు విని విమర్శలు చేయడం కాకుండా, స్వయంగా మార్కెట్‌ను సందర్శించి వాస్తవాలను తెలుసుకోవాలి. అభివృద్ధిలో లోపాలు ఉంటే సద్విమర్శలు, సూచనలు చేయండి. వాటిని స్వీకరించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు మేము సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు**

ఇప్పటికే రాష్ట్రంలోని సుమారు 20–25 మార్కెట్ కమిటీల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి, ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను ప్రశంసించారని తెలిపారు. ఇతర మార్కెట్లలో కూడా ఇలాంటి ఆధునిక సౌకర్యాలు కల్పించాలని తమ ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందిస్తామని వారు పేర్కొన్నట్లు హనుమంతరావు తెలిపారు. "ఖమ్మం జిల్లా రైతులకు ఆధునిక మార్కెట్ సదుపాయాలు అందించాలనే దూరదృష్టితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధిని రాజకీయ కోణంలో చూడకుండా, రైతుల ప్రయోజనాల దృష్టితో స్వాగతించాలి. అందరి సలహాలు, సూచనలను స్వీకరించి మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తాం" అని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు.

## గిరిజన బిడ్డకు గౌరవ డాక్టరేట్

(మొదటి పేజీ తరువాయి...)

నుంచి ఎదిగి, సామాజిక సేవా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెంకటేష్ కు ఈ పురస్కారం దక్కడం సంధ్య తండాతో పాటు కూసుమంచి మండలానికే గర్వకారణంగా నిలిచింది. యువతను ప్రోత్సహించడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం వంటి అంశాల్లో ఆయన చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది.ఆగస్టు 30న జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో వెంకటేష్ కు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేశారు. అంతర్జాతీయ సదస్సులోనూ ఆయన పాల్గొని సామాజిక సేవ, యువజన అభివృద్ధి రంగాల్లో తన వంతు కృషి చేశారు.తండా నుంచి మొదలైన ప్రస్థానం.. గౌరవ డాక్టరేట్ వరకు సాగడం పట్ల సంధ్య తండా ప్రజలు, కూసుమంచి మండలానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. గిరిజన యువతకు వెంకటేష్ సాధించిన ఈ ఘనత స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## ఐసీడీఎస్ లో 'ఆట'..!

(మొదటి పేజీ తరువాయి...)

దొరికితేనే అసలు విషయం బయటపడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

**రికార్డులు ఒకలా.. వాస్తవ పరిస్థితి మరోలా?**

కేంద్రాల్లో హాజరు, సరుకుల నిల్వ, పంపిణీ తదితర వివరాలను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తే అసలు పరిస్థితి ఏమిటో తేలిపోతుందని పలువురు పేర్కొంటున్నారు.

అధికారుల తనిఖీలు కేవలం రికార్డుల పరిశీలనకే పరిమితమవుతున్నాయా?

ఆకస్మిక తనిఖీలు ఎన్ని జరిగాయి?

తనిఖీల్లో లోపాలు బయటపడితే తీసుకున్న చర్యలేమిటి?

ఇప్పుడు ఇవే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

**'ఆట' ఎవరిది..?**

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు, పౌష్టికాహారం లబ్ధిదారులకు చేరాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

అలాంటి పథకాల్లో ఏ చిన్న అవకతవక జరిగినా దాని ప్రభావం నేరుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలపై పడే అవకాశం ఉంది.అందుకే తిరుమలాయపాలెం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి రికార్డులు–క్షేత్ర స్థాయి పరిస్థితులను సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్**

స్టాక్ రిజిస్టర్లు, సరఫరా వివరాలు, బిల్లులు, హాజరు రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, తనిఖీ నివేదికలను పరిశీలించి అసలు నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ వినిపిస్తోంది.ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

ఆరోపణలు అవాస్తవమైతే సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో ప్రజలకు వివరణ ఇవ్వాలి.

**ఇక అసలు ప్రశ్న ఒక్కటే..!**

తిరుమలాయపాలెం ఐసీడీఎస్ లో నిజంగానే 'ఆట' నడుస్తోందా..?

లేక రికార్డులపై వచ్చిన అనుమానాలేనా..?

ఉన్నతాధికారుల విచారణలో అసలు నిజం బయటపడుతుందా..?

విచారణ జరిగితేనే 'ఆట' వెనుక అసలు కథ ఏంటో తేలనుంది..!

# జిల్లాలో 6 చెరువులు మాత్రమే పూర్తిగా నిండాయి

- చెరువులలో నీటిని విడుదల చేస్తే కేసులు నమోదు చేస్తాం.
- సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీరు.
- నీటిపారుదల శాఖ ఎస్.ఈ. మంగళపూడి వెంకటేశ్వర్లు.



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:** జిల్లాలో ప్రస్తుతం 6 చెరువులు మాత్రమే పూర్తిగా వంద శాతం నిండినట్లు నీటిపారుదల శాఖ ఎస్.ఈ. మంగళపూడి వెంకటేశ్వర్లు' పేర్కొన్నారు, మండలం లోని చెన్నారం, రాజేశ్వరపురం గ్రామాల వద్ద పాలేరు పాత కాలువ లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల తో మాట్లాడారు... జిల్లాలో 1400 చెరువులు ఉండగా... అందులో కేవలం ఆరు చెరువులలో సంపూర్ణంగా ఉందన్నారు. 700 చెరువులలో కేవలం 25 శాతం, మరో 300 చెరువులలో 50 శాతం మేరకు మాత్రమే నీరు ఉన్నట్లు తెలిపారు. వైరా, లంకసాగర్ -రిజర్వాయర్ లలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. ఎల్నినో ప్రభావం. వలన ప్రతీ చెరువులో నీటిని చుకు జార కుండా తగిన జాగ్రతలు. తీసుకుంటున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ కు 1552 క్యూసెకుల నీరు వస్తుందన్నారు. ఈ నీటితో పాలేరు రిజ్వారాయర్ ను పూర్తి స్థాయిలో నింపేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం 23 అడుగుల కు గాను, 20.50 అడుగులు ఉన్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో రిజర్వాయర్ ను నింపిన తరువాత కేవలం తాగునీటి కోసం మాత్రమే విడుదల చేస్తామన్నారు. ఖమ్మం. సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల కు మూడు నెలలు పాటు తాగునీటి కి ఇబ్బందులు లేకుండా ఉండేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. తాగునీటికి విడుదల చేసిన తరువాత తిరిగి రిజర్వాయర్ ను నింపేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. చెరువుల నీటిని చేపల వేట కోసం విడుదల చేస్తే. కేసులు నమోదు చేయిస్తామన్నారు. నీటిని వృధా చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది ని నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరెడ్డి, నేలకొండపల్లి, కూసుమంచి డీఈఈలు పొట్టయ్య, బుచ్చిబాబు, జేఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



**రఘునాథపాలెం: ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళక్షేత్రంలో ఘనంగా పవన్ కళ్యాణ్ 55వ పుట్టినరోజు వేడుకలు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 55వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా జనసేన నాయకులు సచ్చు స్రవంత్ ఖన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీమియా బాధితులకు బ్లడ్ డొనేషన్, జన సైనికులు చేపట్టగా కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా.. ప్రజాసేవా కార్యక్రమాలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సచ్చు స్రవంత్ ఖన్నా మెడబోయిన కార్తిక్ యాదవ్ షేక్ ఫయాజ్ రచ్చ నాగరాజు ఎగురీ వరప్రసాద్ ఉత్తమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర ధరలు తగ్గించాలని మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన

- దిద్దుబాటు చర్యల్లో మోడీ సర్కార్ వైఫల్యం.
- ఆవుల అశోక్.

**కారేపల్లి, సెప్టెంబర్ 02, ప్రజా జ్యోతి:** దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయని సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి సెంటర్లో పార్టీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు మాస్ లైన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలు సైతం ఏ నెలకు ఆ నెల పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరల మంటను నియంత్రించడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ ఘోరంగా విఫలమౌతున్నది. కేంద్రం ప్రభుత్వం సామాన్యుడిపై మితిమీరిన ఆర్థికభారాలు మోపుతున్నదని ఆర్థికరంగ నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారని వారన్నారు .కేంద్రం వైఫల్యంధరల నియంత్రణలో కేంద్రంలోని మోడీసర్కారు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. సామాన్యుల వంటింటి ఆర్థిక కష్టాలను ఏమాత్రం నియంత్రించలేకపోతోంది. అయితే ఈ ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఎల్‌నినో సాకును ప్రధానంగా చూపుతున్నారు. పంటల దిగుబడి తగ్గిందని ప్రచారం చేస్తున్నారు. దానివల్లే ధరలు పెరుగుతున్నాయని . డీమార్ట్, రిలయన్స్ వంటి కార్పొరేట్ దిగ్గజ సంస్థలు లక్షల టన్నుల ధాన్యాలను గిడ్డంగుల్లో అక్రమంగా నిల్వ ఉంచి, బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాటిని విడిపించే కనీస ప్రయత్నం కేంద్రం వైపు నుంచి జరగట్లేదు. పైపెచ్చు దేశంలో నిత్యవసరవస్తువుల కొరతను సాకుగా చూపుతూ విదేశాల నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులు చేసుకొనేందుకు అవకాశాలు కల్పిస్తున్నది. అలా వచ్చిన సరుకు కూడా మళ్లీ కార్పొరేట్ల గోడౌన్లలోకే చేరుతున్నాయని అన్నారు. మండలంలో కోతులు పంటలను నష్టపరుస్తున్నాయని ఇళ్లలో సైతం దాడి చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు కోతుల నియంత్రణకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు సమయానికి పూర్తిచేసిన ఫైనల్ బిల్లు పడకుండా పెండింగ్ పెట్టి పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదన సందర్భంగా ప్రభుత్వాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గుగులో తేజ నాయక్, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, అనుసూర్య, సత్తిరెడ్డి, దోమల సీత, శ్రీను, సక్రు, రావుల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, గుమ్మడి ఎర్రయ్య, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.




## ఓటీపీ చెప్తే డబ్బులు పోయినట్టే సైబర్ నేరాలతో జాగ్రత్త

- అవగాహనా కల్పించిన వేంసూరు ఎస్సై -ప్రదీప్



**వేంసూరు, సెప్టెంబర్02 ప్రజాజ్యోతి** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా సైబర్ నేరాలపై ప్రజలకు వేంసూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో ఎస్ఐ పల్లెల. ప్రదీప్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని సూచించారు.బ్యాంక్ నుండి మాట్లాడుతున్నామని ఓటీపీ లు చెప్పాలని అడగగా వ్యక్తిగత వివరాలు,ఓటిపి లు చెప్పి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో: బ్లూ కోట్ కానిస్టేబుల్ శ్రీను,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ఆధ్యుడు వైయస్సార్ ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి సెప్టెంబర్02(ప్రజా జ్యోతి )** దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను,పట్టణంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరై, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ అంటే ఒక చరిత్ర కలిగిన నాయకుడని, ఆయన ప్రజల కోసం ప్రాణాలను అర్పించారని, పేద ప్రజలకు కడుపు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారని ,108 ,ఆరోగ్యశ్రీ ,విద్య, వైద్య ,వ్యవసాయం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పథకాలు అమలు చేశారని వివరించారు. ఆయన అకాల మరణాన్ని ప్రతి ఒక్కరు జీర్ణించుకోలేకపోయారని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని, ప్రతి సంక్షేమ పథకం లో ఆయన శ్వాస ఉందని వివరించారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, గాదె చెన్నారావు, తోట సుజలారాణి,జొన్నలగడ్డ శ్రీనివాసరావు,చల్లగుండ్ల కృష్ణయ్య, దామెర రమేష్, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## రాజన్న సేవలు మరవలేనివి

- జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి :** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్. వైఎస్.రాజశేఖరరెడ్డి సేవలు మరవలేనివి అని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు పేర్కొన్నారు. మండలం లోని కోరట్లగూడెంలో బుధవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా విగ్రహం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో ఆయన మాట్లాడారు....రాజన్న ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. సంక్షమే పథకాల కు చిరునామా గా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెర్రిపోతుల అంజని, మండల నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలం లోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు.

## విద్య కు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి :** తెలంగాణ ప్రభుత్వం విద్య కు పెద్దపీట వేస్తుందని అమ్మా ఆదర్శ కమిటి చైర్మన్ మామిడి తిరపతమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంజూరైన బ్యాగ్ లను బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 500 బ్యాగ్లను విద్యార్థి, విద్యార్థునిలకు ఆమె చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... ప్రవేట్ కు దీటుగా ప్రభుత్వ విద్య ను బలోపేతం చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు త్వరలోనే మధ్యాహ్నం భోజనం ను కూడ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్పోరేట్ స్థాయి లో, బోధన తో పాటు సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్య ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ లింగా వెంకటేశ్వరరావు. మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, ఆధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## కోయచలక, రేగులచలక గ్రామాలలో పువ్వాడ అజయ్ పర్యటన



**రఘునాధపాలెం: ప్రజా జ్యోతి** కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి మూడు సంవత్సరాలు కావోస్తున్న ఇచ్చిన హామీలు పేరుతో ప్రజలను,రైతులను మోసం వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నందుకు నిరసనగా రేపు 10.00గంటలకు నిరసన కార్యక్రమం కోయచలక రేగులచలక గ్రామం లో ఉన్నది ఇట్టి కార్యక్రమాని పువ్వాడ అజయ్ విచ్చేయుచున్నారు కావున మాజీ సర్పంచులు వార్డు మెంబర్లు టిఆర్ఎస్ కార్యకర్తల పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు. గుత్తా రవి మండల మాజీ వైస్ ఎంపీపీ ప్రకటనలో తెలియజేశారు.

## పిల్లలకు ఘనంగా మండల స్థాయి ఆటల పోటీలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం మండల స్థాయి ఆటల పోటీలను మండలంలోని బనిగండ్లపాడు హైస్కూల్లో బుధవారం మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ మురళి మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈఓ మురళి మోహన్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాల నుండి పెద్ద సంఖ్యలో దివ్యాంగ విద్యార్థులు ఉత్సాహంగా తరలివచ్చి ఈ పోటీల్లో పాల్గొన్నారు.పిల్లల వయస్సు, సామర్థ్యాలకు అనుగుణంగా రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ వంటి వివిధ రకాల క్రీడలను పిడి వేణు బాబు నిర్వహించారు. గెలుపోవటములతో సంబంధం లేకుండా పిల్లలందరూ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడల్లో ప్రతిభా కనబరిచిన విద్యార్థులకు అన్ని అంశాలలో మొదటి, రెండవ బహుమతులు షీల్డ్ లను, పాల్గొన్న అందరికీ ప్రశంస పత్రాలు మరియు స్టీల్ బాక్సులను అందజేశారు. ఈ బహుమతులను ఎంఈఓ మురళి మోహన్ , బనిగండ్లపాడు హైస్కూల్ హెచ్ఎం రంగా రెడ్డి, పిఎస్ హెచ్ఎం గుర్నాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జయరాజు ,ఉప సర్పంచ్ రామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల హెచ్ఎం రంగారెడ్డి మాట్లాడుతూ క్రీడలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆటల ద్వారా వారి యొక్క మానసిక,శారీరక నైపుణ్యాలు మరియు క్రమశిక్షణ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పిఎస్ హెచ్ఎం గుర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇతర పిల్లలతో కలిసి ఆడటం వల్ల స్నేహబంధాలు పెరిగి నలుగురితో కలిసిమెలిసి ఉండటం,పంచుకోవడం, జట్టుగా పని చేయడం వంటి నైపుణ్యాలు అలవాడతాయని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వసతులు మరియు భోజన ఏర్పాట్లను ప్రత్యేక ఉపాధ్యాయులు విశ్వనాథం, ఐ ఈ ఆర్ పి లు సరిత, జ్యోతి మరియు పాఠశాల ఉపాధ్యాయులు సురేష్అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, అక్కిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల్గొని పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది యమ్ ఐ ఎస్ త్రివేణి,సి సి ఓ జ్యోతి పాల్గొన్నారు

## బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లాలో బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వందశా తం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మి షన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు.నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అలాగే మేరా/మేరు (MERA/MERU) కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు,పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని, కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

## నేడు గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్

- **పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కొరకు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైట్ ను సందర్శించాలి**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు రెండు నెలల కాలానికి (జాయిన్ అయిన తేదీ నుండి) తాత్కాలిక ప్రాతిపదికన అందించేందుకు నేడు ఉదయం 11 గంటలకు వాక్–ఇన్– ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ ఒకరిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ (ఓబీ, జివై ) ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఈ నియామకాలు రెగ్యులర్,కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు.వాక్–ఇన్–ఇంటర్వ్యూ సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మం లోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ రెండు లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధృవపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నేడు నిర్ణీత సమయానికి నేరుగా వాక్–ఇన్– ఇంటర్వ్యూ కు హాజరుకావాలని సూచించారు.పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు https://khammam.telangana.gov.in ను సందర్శించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వ వర్ధంతి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో డాక్టర్ వై యస్ రాజశేఖర్ రెడ్డి 17 వ వర్ధంతిని పురస్కరించుకొని ముందుగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న లతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి తొలిసారిగా పులివెందుల నియోజకవర్గం నుంచి శాసనసభలో అడుగు పెట్టి ఐదు సార్లు పులివెందుల నుంచి,నాలుగు సార్లు కడప లోక్ సభ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ లో అడుగుపెట్టారని,2003 లో మండు వేసవిలో 1460 కిలోమీటర్లు సాగిన పాదయాత్రలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఆయన విజయానికి బాటలు పరచిందని,2004 ఎన్నికలలో 40వేల మెజారిటీతో విజయం సాధించటమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు పొంది ముఖ్యమంత్రి పీఠం అధిష్టించి ప్రజలు మెచ్చుకునే విధంగా ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన మహానేత అని ఆయన దుర్మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని, మనం అందరం వారి ఆశయాలను కొనసాగించటమే మనం వారికిచ్చే నివాళులు అని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా సేవాదళ్ అద్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, విప్లవ కుమార్,కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ,జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు దొడ్డా పుల్లయ్య,తూములూరి లక్ష్మీ నరసింహారావు, కిలారు అనిల్ కుమార్, మూడుముంతల గంగరాజు యాదవ్,చింతమల్ల రవి కుమార్,యాశబోయిన శ్రీశైలం,జిల్లా ఓ బి సి సెల్ ఉపాద్యక్షులు గజ్జి సూర్యనారాయణ, అర్బన్ జిల్లా కార్పొరేషన్ కార్యవర్గ సభ్యులు కోసూరి ప్రసాద్, ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కొంటెముక్కల నాగేశ్వరరావు,తాళ్లూరి హనుమంతరావు,గుమ్మా రోశయ్య,నుకారపు వెంకటేశ్వరరావు, ఖాజా మురళి,నగర కాంగ్రెస్ నాయకులు రజీ భాయ్,వెంకట్రావు నాయక్,మహమూద్, ఫరీద్ ఖాద్రి,రామకృష్ణ,వీరయ్య గౌడ్,కైసర్, పంది రాజు గౌడ్,నవీన్ యాదవ్ తగది తర నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పూర్తి జిల్లా వ్యాప్తంగా సంబరాలు

- **కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ,అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలిస్తున్న మన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని పిలుపునిస్తున్నాము.ఈ సందర్భంగా నేడు అన్ని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ లు నిర్వహించి,గత 1000 రోజులలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరుతున్నాము.అదేవిధంగా మీ మీ మండల,పట్టణ కేంద్రాలలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి,మిఠాయిలు పంచి ఈ వేడుకను ఘనంగా జరపాలని మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను పత్రికా ముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి







- **ఖమ్మం టౌన్ ఏసిపి**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సైబర్ నేరాల పట్ల ప్రజలు,విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి,తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమేన్స్ డిగ్రీ కాలేజ్ లో సైబర్ జాగృతా దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.ఫోన్‌లలో ఓటీపీ,ఓఎల్ ఎక్స్, పేటీఎం,గూగుల్ పే, ఫోన్ పే,కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు.సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు,పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నా యన్నారు.ఇంటర్నెట్‌ను పరిమితికిమించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి, డబ్బులు కాజేస్తున్నారన్నారు.ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెప్తూ బహుమతులు వచ్చాయని,లాటరీ తగిలిందని,లోన్లు ఇస్తామని ,ఇతరత్రా ఆశచూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించ రాదని తెలిపారు.టెక్నాలజీ పెరిగే కొద్దీ ప్రతి రోజూ కేటుగాళ్లు కొత్త పుంతలు తొక్కుతూ అమాయకుల నుంచి వేలు,లక్షలు, కోట్లు కాజేస్తున్నారు. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల్లో డిజిటల్ అరెస్ట్ మోసాలు పెరిగిపోయాయని,ఈ డిజిటల్ అరెస్టు అనేది కూడా ఒక రకమైన సైబర్ మోసమని,ఇందులో కేటుగాళ్లు ప్రభుత్వ అధికారుల మాదిరిగా నటిస్తూ బురిడీ కొట్టిస్తారన్నారు.బాధితులను భయాందోళనలకు గురి చేసి అందినకాడికి దోచుకుని ఉడాయిస్తారని అన్నారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు మోహన్ బాబు,కరుణాకర్,బాలకృష్ణ,ఉస్మాన్ షరీఫ్ ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**సత్తుపల్లి సెప్టెంబర్02(ప్రజా జ్యోతి )**దివంగత నేత,మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మండల పరిధిలోని గంగారం, కొత్తూరు గ్రామ సర్పంచ్ ల కాకర్ల రేవతి, అయినంపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ,రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన మహనీయుడని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ పేద ప్రజలకు ఉపయోగపడుతున్నాయని, విద్య,వైద్య,వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా ఆయన పథకాలు ఉన్నాయని, ప్రాజెక్టులు విషయంలో కూడా మంచి నిర్ణయాలు తీసుకొన్నారని, ఆయన మరణించినా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి



**కారేపల్లి, సెప్టెంబర్ 2, ప్రజా జ్యోతి:**ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత వైఎస్ఆర్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, జనహృదయనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని బుధవారం సింగరేణి మండల కేంద్రం కారేపల్లి లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు మాట్లాడుతూ వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఆరోగ్యం, విద్యా ,వ్యవసాయం వంటి రంగాలకు ఎనలేని ప్రోత్సాహాన్ని అందించి అన్నివర్గాల హృదయాలను గెలుచుకున్నారన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, స్త్రీలు ,రైతులు ఇలా అందరికీ అభివృద్ధి ,సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాడన్నారు. హైదరాబాద్ సిటీని అభివృద్ధి పదములో ముందంజలో ఉంచిన మహానేతని అన్నారు.ఆయన చూపిన ప్రజాసేవ మార్గంలో నడిచి పేదలకు సేవ చేయడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బానోత్ హీరాలాల్, మేదరి వీర ప్రతాప్, ఆంగోత్ మత్రు నాయక్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు డాక్టర్ పోలగాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు సురేందర్ మనియార్, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, గుగులోతు భీముడు, మల్లెల నాగేశ్వరరావు, షాది ఖానా చైర్మన్ ఎండి యాకూబ్ అలీ, ధరావత్ వినోద్ ,తాజుద్దీన్, హనీఫ్ నాగులు, మజీద్ పాషా, షేక్ షఫీ, జగ్గయ్య, ఆదెర్ల రాములు, తొగర శ్రీను, మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని, మహానేత వైఎస్ఆర్ కు నివాళులర్పించారు.

# ఆదివాసి గిరిజన ఆడబిడ్డ శిరీషపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన సనవుల్లా ఖాన్ ను కఠినంగా శిక్షించాలి

- **: పిడిఎస్యు , పి ఓ డబ్ల్యు**
- **శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ,ఖమ్మం నగరంలో కొవ్వొత్తులతో నివాళులర్పించిన పిడిఎస్యు , పి ఓ డబ్ల్యు**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆదివాసి గిరిజన యువతి శిరీషపై హత్యాచారం చేసిన బీహార్ మెకానిక్ సనవుల్లా ఖాన్ పై కఠిన చర్యలు తీసుకొవాలని.పిడిఎస్యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు.లక్ష్మణ్, పి ఓ డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు టి.ఝాన్సీ,ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శులు ప్రతాపనేని.శోభా డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో శిరీషకు కొవ్వొత్తుల తో నివాళులర్పించి వారు మాట్లాడుతూ ఆదివాసి కుటుంబం నుండి ఉన్నత చదువులు చదువుకొని జీవనోపాధి కోసం నర్సు వృత్తిని చేపట్టి వచ్చిన జీతంతో ఆ కుటుంబాన్ని శిరీష పోషిస్తుందని ఈ క్రమంలో శిరీష అత్యాచారానికి గురై మరణించడం తెలవడంతో కుటుంబమే కాకుండా తెలంగాణ సమాజం మొత్తం దిగ్భ్రాంతికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారుల నుండి మొదలుకొని పని ప్రదేశాలలో మహిళలు,ప్రయాణించే మహిళల పైన,ఆఖరికి వృద్ధ మహిళల పైన సైతం అత్యాచారాలు జరగడం తెలంగాణ సమాజం సిగ్గుపడుతుందని అన్నారు.నేరస్తులను నామమాత్రంగా శిక్షించి అత్యాచార ప్రేరేపిత మూలాలను అంతమొందించకుండా ఇలాంటి దారుణాలను అరికట్టడం సాధ్యం కాదని ఆయన అన్నారు.నిర్భయ చట్టాల అమలులో పాలకుల వైఫల్యాల మూలంగా ఇలాంటి దారుణాలు మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు నిజంగా మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే భద్రతా చర్యలు చేపట్టే విధంగా చట్టాలను పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. దేశంలో జీవనోపాధి కోసం అనేకమంది మహిళలు హైదరాబాద్ నగరం చేరుకుంటున్నారని పనిచేసే పని ప్రదేశాలలో నిర్లక్ష్యంగా రక్షణ చర్యలు కల్పించకుండా ఉన్న యాజమాన్యాల పట్ల కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అదేవిధంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన భద్రతా చర్యలను నిర్లక్ష్యం చేయకుండా మహిళలకు భద్రత రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. నేరస్తులను అంతం అందించడం కాకుండా చట్టపరంగా శిక్షించి నేరాలకు మూలమైన గంజాయి,డ్రగ్స్,కొకైన్, అశ్లీల సాహిత్యం,వైన్ లాంటి మత్తు పదార్థాలపై నిషేధించి అంతమొందించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి సాదిక్ జిల్లా నాయకులు కార్తీక్,వెంకటేష్,గణేష్,బాలు తదితరులు పాల్గొన్నారు.




# కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులకు 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులకు మూడోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, ఖమ్మం నందు గౌరవ జడ్జి అరవ ప్రవీణ్ ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, అదేవిదంగా ఒక్కొక్కరికి రూ.5,000 జరిమానా, మొత్తం రూ.15,000 జరిమానా విధించారని ఇన్స్పెక్టర్ మోహన్ బాబు తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక్కొక్కరు అదనంగా మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వివరించారు.

**కేసు వివరాల ప్రకారం :**

ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో Cr.No.83/ 2018 U/s 365 IPC, CC.No.285/2018గా నమోదైన కేసులో చక్కిలెల నాగమల్ల సతీష్ ఎ 1, చక్కిలెల సంతోష్ (A2), చక్కిలెల సుమన్ ఎ 3 నిందితులుగా ఉన్నారు.2018 ఏప్రిల్ 20న రాత్రి సమయంలో ఖమ్మం కిన్నెరసాని థియేటర్ ఎదురుగా ఉన్న కిరాణా జాగిరి మర్చంట్స్ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన వివాహ కార్యక్రమంలో కొత్త విశ్వనాథంతో గొడవపడి,అతనిని బలవంతంగా కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి, రహస్య ప్రదేశంలో అక్రమంగా నిర్బంధించినట్లు కేసు నమోదైందని తెలిపారు. ఈ మేరకు భార్య కొత్త గీత 2018 ఏప్రిల్ 21న ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జ్‌షీట్ దాఖలు చేశారని పేర్కొన్నారు.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి ఇన్స్పెక్టర్ యు . వెంకన్న బాబు, (ప్రస్తుతం డీఎస్పీ , ఇల్లందు) పనిచేశారు. బ్రీఫింగ్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ జె . మో హన్ బాబు,ఏపీపీ ఎస్ . గాయత్రి సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ నిర్వహించ గా, సీడీఓ వి . రామకృష్ణ, కోర్టు లైజన్ అధికారులు కె . శ్రీకాంత్, ఎస్సై , కె . శ్రీనివాస్, హెచ్ సి , డి . నాగేశ్వరరావు, హెచ్ సి సహకరించారు. ప్రసూక్యూషన్ కు సహకరించిన అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# గ్రామంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

- **సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి**



**ఎర్రుపాలెం:** మండలంలోని రామన్నపాలెం గ్రామంలో డ్రైనేజీల పూడికతీత పనులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు. గ్రామంలో మురుగునీరు సజావుగా ప్రవహించేలా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి పరమేశ్వరి మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొర్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పూడికతీత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిరంతరం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని సర్పంచ్ తెలిపారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంచాయతీ సిబ్బంది బొబ్బిళ్ళ పాటి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు

# నేడు ఉపాధ్యాయులకు ధ్యాన శిక్షణ

- మాన
సిక ప్రశాంతత,ఏకాగ్రత పెంచటా
నికి ధ్యానం.
- ముక్క స్వరాజ్యలక్ష్మి



**కారేపల్లి, సెప్టెంబర్ 2, ప్రజా జ్యోతి :** సింగరేణి మండలంలోవి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం నుండి ప్రత్యేక ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు బుధవారం ఎంఈఓ దుగ్గిరాల జయరాజు, కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటన తెలిపారు. వారి సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల బోధనతో పాటు అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో మానసిక ప్రశాంతత,ఏకాగ్రత,సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడంలో ధ్యానం దోహదపడుతుందని తెలిపారు. ఒత్తిడిని తగ్గించం,బోధనలో ఏకాగ్రత సాధించేందుకు ధ్యానం ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు స్వయంగా ధ్యానం చేయడం నేర్చుకోవడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు
ధ్యానాన్ని ఏ విధంగా పరిచయం చేయాలి,పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధించాలి, వారిలో ఏకాగ్రత,ప్రశాంతత,క్రమశిక్షణ,సానుకూల ఆలోచనలు పెంపొందించేలా ధ్యాన సాధనను ఎలా అలవాటు చేయాలి అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ధ్యాన శిక్షణ కార్యక్రమానికి పిరమిడ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి,పీఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ, భూపతిరాజు హనుమంత రావు,రమేష్ తదితరులు హాజరై ధ్యానం ప్రాధాన్యత,ఆచరణ విధానం,విద్యార్థులకు ధ్యానాన్ని బోధించే పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.దీనిని కారేపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మంత్రి ఆదేశాలతో కదిలిన అధికారులు

- క్షేత్ర స్థాయిలో కాలువలను పరిశీలన.



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో బుధవారం పరిశీలన చేశారు. ప్రజాదర్బార్ లో గతంలో ఇచ్చిన దరఖాస్తుల కు సంబంధించిన ప్రగతి పై మంత్రి సమీక్ష నిర్వహించారు. వెంటనే దరఖాస్తుల పై పరిశీలన చేసి...సాధ్యా . ఆసాధ్యాల పై నివేదికను అందించాలని ఆదేశించారు. ఈ మేరకు మండలం లోని చెన్నారం, మండ్రాజుపల్లి, నాచేపల్లి, భైరవునిపల్లి గ్రామాలలో ఇరిగేషన్ అధికారులు పర్యటించారు. చెన్నారంలో పంట కాలువ కు దాదాపు 1 కిలో మీటర్ వరకు గైడ్ వాల్ ను నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సర్వే నిర్వహించారు. నాచేపల్లి, భైరవునిపల్లి చెరువుల పై –పరిశీలించారు. రైతుల వినతుల పై సాధ్యా. ఆసాధ్యాలు పై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ను అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ జేఈ లు టి.నరేష్, మధీనా, ప్రతి రిత్వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి లో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**కారేపల్లి, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి :** సింగరేణి మండల కేంద్రంలో బుధవారం జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కారేపల్లి బస్టాండ్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ధరావత్ కళ్యాణ్, భరోత్ కళ్యాణ్, బడుగుల శ్రీను, మొగిలిచర్ల రాంబాబు (కుమ్మరి), పురం రామరాజు, శ్రీను, పొగాకు సాయి, షేక్ నజీమ్, బొడ్డు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

**కల్లూరు, సెప్టెంబర్ 02 :** ప్రజా జ్యోతి కల్లూరు మున్సిపాలిటీ 16వ వార్డులో కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వస్తువుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా వాటిలో చేపడుతున్న అభివృద్ధి మనలో పై స్థానిక ప్రజలతో చైర్మన్ చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయడంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గుండ్ల పుల్లారావు కాంగ్రెస్ నాయకులు అప్పిరెడ్డి, నోటి కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, జంగం నరసింహారావు, రవికుమార్ స్థానికులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## అంబేద్కర్.. మా ఆకలి బాధలు తీర్చవయ్యా




**కల్లూరు, సెప్టెంబర్ 02 : ప్రజా జ్యోతి** తొమ్మిది నెలలుగా జీతాలు అందక ఆకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల బుధవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట వినతిపత్రం సమర్పించి మొరపెట్టుకున్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఐదో రోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు.ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ 9 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నయని అన్నారు. నిత్యవసర సరుకుల ధరల్లో పెరిగిన పరిస్థితుల్లో జీతాలు లేకుండా ఎలా బతకాలని ప్రశ్నించారు మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు అధికారులను పలుమార్లు కలిసి సమస్యను విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికులను అప్పుల భారం నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వజేర్మియ, నాయకుల సుజాత, రాము, మనోజు, జగతి, అర్జున్, జగదీష్, దామాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బేతుపల్లి లో వైయస్సార్ వర్ధంతి వేడుకలు



**సత్తుపల్లి సెప్టెంబర్02(ప్రజా జ్యోతి)** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సీఎం గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, మన్నెని గంగాజి, చెన్నకేశవులు, దొడ్డ వెంకటేశ్వర్లు,మన్నెని నాగేశ్వరరావు, సాంబ, కృష్ణయ్య, ప్రభాకర్ రావు,నవీన్ సూర్య, శ్రీను ,రవి తదితరులు పాల్గొన్నారు.

## జీళ్ళచెరువులో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి**
కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల లింగయ్య ఆధ్వర్యంలో స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు, గ్రామశాఖ అధ్యక్షుడు ఇంటూరి పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ కాసాని వెంకన్న, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లం సాయితేజ, కాంగ్రెస్ నాయకులు ఐతగాని నాగేశ్వరరావు, గోపగాని వీరబాబు, ముద్రబోయిన సత్యనారాయణ, అంబాల రామనాధం, కత్తి వెంకన్న, కత్తి స త్యం, తమ్మరబోయిన లక్ష్మయ్య, ఐతగాని సత్యనారాయణ, అంబాల అంజ య్య, మండవ హుస్సేన్, కొండా శ్రీను, గోపి సింహాద్రి, వార్డ్ సభ్యులు గోపి రవి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగుపెడతామని... పౌడర్ చల్లి... చోరీకి యత్నం

- దేహశుద్ధి చేసిన స్థానికులు. పోలీసులకు పట్టించిన స్థానికులు

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి:** వస్తువులు మెరుగు పెడితే...మెరిసిపోతాయని...మాయమాటలు చెప్పి..నమ్మించి ఓ మహిళ వద్ద పట్టీలకు పౌడర్ చల్లటంతో పట్టీలు లింకులు తెగి పడ్డాయి. దీంతో అనుమానంతో స్థానికులు వారిని పోలీసులకు పట్టించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి లోని ఎస్సీ, బీసీ కాలనీలో బుధవారం బీహార్ కు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు బంగారం కు మెరుగుపెడతామని కాలనీలో పర్యటించారు.వచ్చిన గుంపులో ముగ్గురు త్రివేణి అనే మహిళ ఇంటికి వెళ్లి మీ వస్తువులకు మెరుగుపెడతామని చెప్పారు. కానీ త్రివేణి వద్దని చెబుతున్న పట్టీలకు ఓ పౌడర్ ను చల్లాడు. అంతే బాధితురాలి పట్టీలు 15 తులాలు ఉండగా.... పౌడర్ చల్లిన తరువాత నీటిలో కడిగిన వెంటనే 5 తులాలు పట్టీలు ఇచ్చాడు. ఇవి మావి కాదని చెప్పటంతో వాగ్వివాదం కు దిగారు. వీరి పై అనుమానంతో బాధితురాలు కేకలు వేయటంతో విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలం కు చేరుకుని వారికి దేహశుద్ధి చేశారు. గొడవ జరుగుతుండుగానే ఒకరు పరారైయ్యారు. ఇరువురు ను పోలీసులకు అప్పగించారు. బీహార్ కు చెందిన వీరు ఒక ముఠా గతం నాలుగు రోజుల క్రితం రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. అయితే బాధితురాలి మెడలో బంగారం ఉండటంతో వారి ఆలోచన బంగారం చోరీ చేయాలనే రెక్కీ కూడ నిర్వహించారని స్థానికులు పేర్కొంటున్నారు. భీహార్ కు చెందిన ముఠా మండలం లో సంచరిస్తున్నట్లు అనుమానంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇరువురు ప్రస్తుతం స్థానిక పోలీసుల అదుపులో ఉన్నారు.